సాక్షి
శ్రీకాకుళం

శనివారం। 20। జూలై। 2024



తప్పిన పెనుప్రమాదం

ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టింది. తొమ్మిది మందికి గాయాలయ్యాయి.

- 8లో

నేడు బడులకు సెలవు

శ్రీకాకుళం న్యూకాలనీ: తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లాలో పాఠశాలలకు శనివారం సెలవు ప్రకటించినట్లు డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అన్ని యాజమాన్య పాఠశాలలకు ఈ సెలవు వర్తిస్తుందని.. విద్యార్థులను ఇళ్ల నుంచి బయటకు పంపించవద్దని సూచించారు. అయితే ఈ సెలవుకు బదులుగా మరో సెలవు దినంలో పాఠశాలలు పనిచేయాల్సి ఉంటుందని డీఈఓ పేర్కొన్నారు.

15 రోజులు జీడి పరిశ్రమలు క్లోజ్

కాశీబుగ్గ: పలాసలో జీడి పరిశ్రమలు 15 రోజులు మూత పడనున్నాయి. శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో పారిశ్రామిక వాడ సభ్యులు ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి పదిహేను రోజుల పాటు బంద్ చేస్తున్నామని అన్నారు. జీడి ఉత్పత్తులు టన్నుల కొద్దీ నిల్వలు పేరుకుపోయాయని, నిరంతరాయంగా వర్షాలు కురవడంతో ఇబ్బందికర పరిస్థితి వచ్చిందని కార్మికులు అందరూ సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

ఎల్‌ఎల్‌బీ 3, 6, 7 సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయ విద్య ఎల్ఎల్‌బీ 3, 6, 7 సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞాన భూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీకి సంబంధించి మూడో సెమిస్టర్‌లో 29 మందికి 20, ఆరో సెమిస్టర్‌లో 20 మందికి 18, ఏడో సెమిస్టర్‌లో 23 మందికి 21మంది ఉత్తీర్ణత సాధించారు. మూడేళ్ల న్యాయ విద్యలో మూడో సెమిస్టర్‌లో 91 మందికి 84 మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే వారు 15 రోజుల్లో వర్సిటీ పరీక్షల నిర్వహణ విభాగానికి చేరుకోవాల్సి ఉంటుంది.

బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 25వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. మొదటి రోజు 1220 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం, శ్రీకాకుళం మహిళా, టెక్కలి, పలాస ప్రభుత్వ కళాశాల, రాజాం జీసీఎస్ఆర్, పాలకొండ తమ్మినాయుడు కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భా స్కర్ పరీక్షలు పర్యవేక్షించారు.

ఆ గుండె బతికే ఉంటుంది



చల్లా శ్రీనివాసరావు (ఫైల్)

శ్రీకాకుళం రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి ఆదర్శంగా నిలిచారు. గోవిందపురం పంచాయతీ జొన్నలపాడు గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాసరావు (26) నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఈ నెల 14న విశాఖపట్నం నుంచి శ్రీకాకుళంకు తిరిగి వస్తుండుగా పెదపాడు సమీపంలోని కేంద్రీయ విద్యాలయం వద్ద కంటైనర్ లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డా డు. చికిత్స కోసం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. వారం రోజులుగా కోమాలో ఉన్న శ్రీనివాసరావుకు బ్రెయిన్ డెడ్ కావడంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకువచ్చారు. దీంతో శుక్రవారం కిడ్నీ, లివర్, హార్ట్‌తో పాటు ఇతర అవయవాలను శరీరం నుంచి వేరు చేసి తరలించారు. శ్రీనివాసరావు అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో జరగనున్నాయి. శ్రీనివాసరావు అవివాహితుడు. ఆయన మృతిపై తల్లిదండ్రులు మల్లేషు, అప్పమ్మలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



మాకన్నపల్లిలో సచివాలయం వద్ద వినతి పత్రం అందజేస్తున్న రైతు కార్మిక నాయకులు

పలాస: ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఏపీ జీడి రైతాంగ కమిటీ జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం పలాస మండలం మాకన్నపల్లి, కాశీబుగ్గ గాంధీనగర్‌లోని సచివాలయాల వద్ద గల అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజుకు రూ.600లు చెల్లించాలని, రైతులకు పంటల బీమా పరిహారం చెల్లించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. అలాగే జీఓ నంబర్ 22ను రద్దు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో రైతులు గార రుద్రయ్య, జుత్తు నరేష్, కిషోర్, బత్తిన తేజ, అప్పలస్వామి, పాతిన త్రినాథ్, జి.ఉమాపతి, తెప్పల కార్తీక్, ఎ.వీరాస్వామి, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రత్యేక విధుల్లో సివిల్ సప్లై అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడకుండా, అన్ని సరుకులు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు జిల్లాలో పౌర సరఫరాల విభాగం నుంచి ఏడుగురు అధికారులను ప్రత్యేక విధుల్లో నియమిస్తూ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బి.శాంతి ఉత్తర్వులిచ్చారు. వీరిని అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వీరంతా కంట్రోల్‌రూంకి అనుసంధానంగా ఉంటారని తెలిపారు.



ఎచ్చెర్ల మండలం పూడివలసలో టీడీపీ నాయకులు కోరాడ సన్యాసిరావు, అంపోలు రాజారావులు వేర్వేరుగా ప్రభుత్వ తాగునీటి బావికి అక్రమంగా మోటార్లు పెట్టి నీరు వినియోగిస్తున్న దృశ్యమిది


ఎచ్చెర్ల మండలం పూడివలసలో టీడీపీ నాయకులు అంపోలు వైకుంఠరావు, గొలివి రాజారావు, అంపోలు గణేష్, గొలివి సింహాచలం పబ్లిక్ తాగునీటి బావికి అక్రమంగా మోటర్ బిగించి నీరు వాడుకుంటున్న దృశ్యమిది.



కానివారిపై.. కాలకూటమి విషం

ఎచ్చెర్లలో కూటమి రాజ్యాంగం

- విపక్ష నాయకులపై వివక్ష
- అన్ని విషయాల్లోనూ కక్ష సాధింపు రాజకీయాలు
- పబ్లిక్ బావులకు ఏర్పాటు చేసిన అక్రమ మోటార్లు తొలగించే విషయంలో దుర్నీతి
- ప్రజల కోసం సర్పంచ్ ఏర్పాటు చేసిన మోటార్ తొలగింపు
- టీడీపీ నాయకుల మోటార్ల జోలికి వెళ్లని అధికారులు
- కూటమి నాయకుల వైఖరిని వ్యతిరేకిస్తున్న పూడివలస గ్రామస్తులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పబ్లిక్ బావులకు మోటార్లు పెట్టి నీటి వినియోగం చేపట్టకూడదు. ఒకవేళ ఎవరికైనా వ్యక్తిగతంగా అవసరమైతే ప్రత్యేకంగా బోరు వేసుకుని నీటిని వినియోగించుకోవాలి. ఇలా అక్రమంగా నీరు వినియోగిస్తే వారిపై చర్యలు తీసుకోవాలి. కానీ టీడీపీ నాయకులు అక్రమంగా మోటార్లు పెట్టి నీటిని వినియోగిస్తుంటే ప్రభుత్వ పెద్దలకు కనిపించడం లేదు. అదే ప్రతిపక్షానికి చెందిన వారైతే మాత్రం వెంటనే చర్యలు తీసుకుంటారు. ఇప్పుడు ఎచ్చెర్ల నియోజకవర్గంలో నడుస్తున్న 'కూటమి' రాజ్యాంగమిది.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఫలితాలు వచ్చాక రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఎచ్చెర్లలో అయితే ఎమ్మెల్యే రాజ్యాంగం కూడా నడుస్తోంది. ఇక్కడ ఎవరి దందా వారిది. అధికారులను కూడా వదలడం లేదు. బట్టలు ఊడదీసి తంతాం అని బెదిరిస్తున్నారు. గట్టిగా మాట్లాడితే ఇక్కడ పని చేయలేవు అని అంటున్నారు. ఇంకా ప్రతిఘటిస్తే జిల్లాలోనే పని చేయలేవని హెచ్చరిస్తున్నారు. చెప్పినట్టుగా చేస్తే చేయండి.. లేదంటే ఉద్యోగాలను వదిలేసి వెళ్లిపోండని హుకుం జారీ చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఎలాంటి తప్పులకు పాల్పడినా చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రస్తుతం అరాచకం రాజ్యమేలుతోంది. కూటమి ఎమ్మెల్యే ప్రోద్బలం, ఆయనఅండతో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోతోంది.

పూడివలస గ్రామంలో ప్రజలకు అవసరమని సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు ఒక పబ్లిక్ బావికి మోటార్ తగిలించి ప్రజా శ్రేయస్సు దృష్ట్యా తాగు నీరు అందిస్తుంటే సహించలేకపోయారు. కూటమి నాయకులు యుద్ధ ప్రాతిపదికన ఫిర్యాదు చేసి, ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చి అధికారుల చేత యుద్ధ ప్రాతిపదికన మీటర్లను పీకిపారేశారు. అదే గ్రామంలో టీడీపీకి చెందిన కోరాడ సన్యాసిరావు, అంపోలు రాజారావు, అంపోలు వైకుంఠరావు, గొలివి రాజారావు, అంపోలు గణేష్, గొలివి సింహాచలం బహిరంగంగా పబ్లిక్ బావులకు మోటార్లు పెట్టి వ్యక్తిగతంగా తాగునీటిని వినియోగిస్తున్నారు. గ్రామ ప్రజల కోసం సర్పంచ్ చేస్తే తప్పు అంట.. అదే టీడీపీ నాయకులు తమ వ్యక్తిగత అవసరాల కోసం పబ్లిక్ బావులకు మోటార్లు పెట్టి నీరు వినియోగిస్తే నేరం కాదట. ఇక్కడ ఆ రూల్ పెట్టుకుని కుట్ర రాజకీయాలకుపాల్పడ్డారు. న్యాయమంటే అందరికీ ఒకేలా ఉండాలి. మనిషికో న్యాయం ఉండకూడదు. పార్టీకో విధానం అస్సలు ఉండకూడదు. ఇక్కడ వాటన్నింటికీ తిలోదకాలిచ్చి కూటమి నాయకులు చెప్పినట్టుగా జరిగేదే న్యాయంగా అమలు చేస్తున్నారు.

బెంబేలెత్తిపోతున్న అధికారులు, ఉద్యోగులు



కూటమి నాయకులు అనుసరించిన తీరు, ఎమ్మెల్యే స్పందించిన విధానం, చెప్పినట్టుగా చేయాలని చేస్తున్న ఒత్తిడి నేపథ్యంలో అధికారులు, ఉద్యోగులు జీతం జీర్ణించుకోలేకపోతున్నారు.

కూటమి నాయకులు వ్యవహరిస్తున్న తీరుతో బెంబేలెత్తిపోతున్నారు. తంతాం అనే స్థాయికి నాయకులు వెళ్లిపోవడంతో బితుకుబితుకుమని ఉద్యోగులు సైతం పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూడివలస అక్రమ మోటార్ల విషయంలో కూడా అదే జరిగింది. కూటమి నేతలు చెప్పినట్టుగా గ్రామ ప్రజల అవసరాల కోసం పబ్లిక్ బావికి ఏర్పాటు చేసిన మోటార్‌ను తొలగించాం.. అదే తరహాలో మిగతా వ్యక్తులు ఏర్పాటు చేసిన అక్రమ మోటార్లను తొలగిస్తే సమన్యాయం అవుతుందని ఉద్యోగులు, అధికారులు భావిస్తే వారికి బెదిరింపులు, ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. సమన్యాయం చేయలేకపోతున్నామన్న ఆవేదన, కూటమి నాయకుల నుంచి వస్తున్న ఒత్తిళ్లు తట్టుకోలేక గ్రామ కార్యదర్శి సీతారామరాజు ఏకంగా తన ఉద్యోగాన్ని వదులుకునేందుకు సిద్ధమై రాజీనామా చేసేశారు. అయితే, ఆ రాజీనామా నిర్దేశిత ఫార్మెట్‌లో లేదని అధికారులు తిరస్కరించడంతో తప్పని పరిస్థితుల్లో సదరు కార్యదర్శి విధుల్లో చేరారు. కానీ, తన విధి నిర్వహణలో తేడా ఉండకూడదన్న ఉద్దేశంతో పబ్లిక్ బావులకు అక్రమంగా ఏర్పాటు చేసిన మోటార్లు అన్నింటినీ తొలగించాలన్న నిర్ణయానికి కట్టుబడి చర్యలకు ఉపక్రమించారు. అక్రమ మోటార్లు తొలగించేందుకు రక్షణ కావాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, వారి నుంచి సహకారం అందలేదు. కూటమి నాయకుల ఒత్తిడి మేరకు పోలీసుల వైపు నుంచి సహకారం లభించలేదు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల తీరు, కూటమి నాయకుల కక్ష సాధింపులను గమనిస్తున్న ప్రజలే చివరికి ఛీకొడుతున్నారు. అక్రమ మోటార్లు అన్నింటిని తొలగించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

'సాగు, తాగునీరు అందిస్తాం'



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్యలు పరిష్కరిస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్ జగన్ హయాంలో ప్రారంభించిన వైఎస్సార్ సుజలపథకం ద్వారా ఎన్ని గ్రామాలకు నీటిని అందిస్తున్నారని ప్రశ్నించారు. గ్రామీణ నీటి పారుదల శాఖ ఎస్ఈ మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వం రూ.700కోట్లతో ఏడు మండలాల్లో 807 గ్రామాలకు తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇప్పటికే రూ.600 కోట్లు ఖర్చు చేసి 208 గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. మొదటిదశ పనులు పూర్తయ్యాయని, రెండోదశ పనులు పూర్తయితే ప్రతి ఇంటికి తాగునీటిని అందించగలమన్నారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ పనులు పూర్తి కాకపోతే అప్పటి ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టుని ఎందుకు ప్రారంభించారో అర్థం కావడం లేదని, ఊరికే ప్రకటనలు చేశారని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై సంబంధిత అధికారి సరిగ్గా సమాధానం చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అధికారులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి రూ.10 కోట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన ఇన్‌చార్జి దాసరిరాజు తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తామన్నారు.

జడి వాన



- విస్తారంగా వానలు
- నేడు కూడా కురిసే అవకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. పలు చోట్ల భారీ వర్షాలు కురిశా యి. దీంతో జిల్లా అంతా చల్లబడింది. నేడు కూడా వానలు కురిసే అవకాశం ఉండడంతో ప్రధాన నీటి వనరుల్లో నీటి మట్టం పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది వంశధార, నాగావళి జలాశయాల్లో ఇప్పటి వరకు ఆశించినంత నీరు లేదు. ఈ వానలతో జలాశయాల్లో నీరు వచ్చి చేరుతోంది.

వర్షాలపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్..

వానలు పడతాయన్న హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. వర్షాలపై మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించా రు. గాలులు వీచే అవకాశం ఉన్నందున జిల్లా పంచాయతీ రాజ్, విద్యుత్ ఇతర ప్రజా సంబంధం ఉన్న శాఖలను అప్రమతం చేశారు.

08942 240557, 7794082017 నంబర్లను ప్రజల కోసం అందుబాటులో ఉంచారు.

శ్రీకాకుళం డివిజన్‌లో అధికం..

డివిజన్	శ్రీకాకుళం	పలాస	టెక్కలి	జిల్లా వ్యాప్తంగా
వర్షపాతం మిల్లీమీటర్లలో	50	46.4	33.3	1323.8 మిల్లీమీటర్ల వాన

జిల్లాలో సగటున	అధికంగా: రణస్థలం	లావేరు	ఎచ్చెర్ల	సోంపేట	మందస
44.1 మిల్లీమీటర్ల	105.4	82.4	73.6	60.6	60.4

అలజడి



ఇసుక దిబ్బలు దాటి ఒడ్డుకు కొట్టుపోయిన తెప్పలు

వజ్రపుకొత్తూరు: సముద్రంలో అలజడి రేగింది. అల్ప పీడనం ప్రభావంతో కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. మత్స్యకారులు తీరంలో లంగరు వేసిన తెప్పలు, పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వజ్రపుకొత్తూరు సమీపంలోని తీర ప్రాంతాల్లో ఇసుక మేటలు దాటి సంద్రం ముందుకు రావడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ ఎం.సురేష్ శుక్రవారం వీఆర్‌ఓల తో సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వీఆర్‌ఓలకు సెలవులు రద్దు చేసి గ్రామాల్లోనే ఉండాలని ఆదేశించారు. పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న పరిస్థితిపై నిత్యం సమీక్ష నిర్వహిస్తున్నారు.

కూలిన ఇంటి గోడ



కూలిపోయిన ఇంటి గోడ వద్ద బాధితుల కుటుంబం

ఎల్.ఎన్.పేట: మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సుమంతాపురం గ్రామంలో కంటుమజ్జి విమలంబ నివా సం ఉంటున్న ఇంటి గోడ కూలిపోయింది. శుక్రవారం ఉదయం కురుస్తున్న వర్షానికి ఒక్కసారిగా గోడ కూలిపోయిందని బాధితురాలు విమలంబ ఆవేదన వ్యక్తం చేశారు. గోడ కూలిపోయే సమయానికి పిల్లలు ఎవరూ ఆ ప్రాంతంలో లేకపోవటంతో ప్రమాదం తప్పింది. ఇద్దరు పిల్లలతో ఇప్పుడు ఎక్కడ ఉండేదని ఆమె ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

'విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండండి'

అరసవల్లి: వర్షాలు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యు త్‌శాఖ ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాను ప్రభావం దృష్ట్యా ప్రజలు తమ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు, ఫిర్యాదులు చేసేందుకు శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేసినట్టు ఎస్‌ఈ కృష్ణమూర్తి పేర్కొన్నారు.

9490612633 నంబర్‌ను సంప్రదించాలని, అలాగే ఏపీఈపీడీసీఎల్ సెంట్రలైజ్డ్ టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలన్నారు. అలాగే ప్రత్యేక పర్యవేక్షణ కోసం విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయాల్లోనూ హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసినట్టు ఆయన చెప్పారు.

శ్రీకాకుళం డివిజన్	:	9490610045
టెక్కలి డివిజన్	:	83328 43546
పలాస డివిజన్	:	7382585630
పాలకొండ డివిజన్	:	8332843546

నంబర్లను సంప్రదించాలన్నారు.


తుఫాన్‌ను ఎదుర్కొందాం



శ్రీకాకుళం పాతబస్టాండ్: తుఫాన్ ఏ స్థాయిలో వచ్చినా ఎదుర్కొనేలా జిల్లా యంత్రాంగం సిద్ధం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులతో తుఫాన్ అప్రమత్తతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందస్తు ఏర్పాట్లపై జేసీ ఎం.నవీన్‌తో కలిసి సమీక్షించారు. నదులు, కాలువలు, బ్యారేజీలను పర్యవేక్షించాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీరే తాగాలని జనాలకు చెప్పాలన్నారు. తుఫాన్ కేంద్రాలు, పునరావాస కేంద్రాల నిర్వహణ పరిశీలించాలన్నారు. విపత్తు కారణంగా సిబ్బంది సెలవులు రద్దుచేయాలని సూచించారు. నదులు, కాలువలు, చెరువులు ఎక్కడైనా పాడైతే తక్షణమే మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ వంశధార పరీవాహక ప్రాంతాలపై దృష్టి సారించాలని వంశధార ఎస్‌ఈ రాంబాబును ఆదేశించారు. ఎస్‌ఈ మాట్లాడుతూ వంశధారలోకి తక్కువ నీరే వస్తోందన్నారు. ఇరిగేషన్ ఎస్‌ఈ సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం బ్యారేజీలోకి వచ్చే నీరు తక్కువగా ఉందన్నారు. విద్యుత్ నిలుపుదల, మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్, మున్సిపాలిటీల్లో జాగ్రత్తలపై సంబంధిత అధికారులు చర్చించారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ తాగునీటికి సంబంధించి సరఫరాపై వివరించారు. డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి మాట్లాడుతూ భారీ వర్షాలకు సచివాలయం స్థాయి నుంచి గర్భిణుల జాబి తా సిద్ధంగా ఉంచామని, వైద్యాధికారులను అప్రమత్తం చేసినట్లు వివరించారు. కొండ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో గర్భిణులను జాగ్రత్తగా చూడాలని జేసీ సూచించారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కండీషన్‌లో ఉన్న బోట్ల వివరాలు చూడాలన్నారు. వ్యవసాయ శాఖపై జేడీ శ్రీధర్ మాట్లాడుతూ నారుమళ్లు కుళ్లిపోతే విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు వివరించారు.

స్వల్పంగా పెరిగిన వంశధార



హిరమండలం బ్యారేజీ నుంచి దిగువకు విడిచిపెడుతున్న వరద నీరు

హిరమండలం: గొట్టా బ్యారేజీ వద్ద శుక్రవారం స్వల్పంగా వరద నీరు పెరిగింది. అల్పపీడనం ప్రభావంతో ఒడిశా కేచ్‌మెంట్ ఏరియాలో గత రెండు రోజులుగా పడుతున్న తేలికపాటి వర్షాలకు వంశధారలో వరద నీరు వచ్చి చేరుతోంది. గొట్టా బ్యారేజీ వద్ద 38.10మీటర్ల నీటిమట్టం ఉంది. బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 3,353 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోంది. వచ్చిన నీటిని స్పిల్‌వే తోపాటు రెండు గేట్లు 20 సెంటీమీటర్లు పైకి ఎత్తి దిగువకు 1805 క్యూసెక్కులు విడిచిపెట్టినట్లు డీఈ రంగనాయకులు తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1108 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 440 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్లు డీఈ చెప్పారు.

క్లుప్తంగా

దిశ పోలీస్‌స్టేషన్ సందర్శన



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలో ఉన్న దిశ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సందర్శించారు. డీఎస్పీ రుప్ప శ్రీనివాసరావు తమ సిబ్బందితో సాదరస్వాగతం పలికారు. సిబ్బంది సమస్యలు, కేసుల వివరాలు అడిగి తెలుసుకోవడమే కాక రిసెప్షన్‌లో ఉన్న రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. బాలికలపై ఎలాంటి లైంగిక దాడులు జరిగినా తక్షణమే స్పందించాలని, మహిళలను వేధించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భార్యాభర్తల తగాదా కేసుల్లో సాధ్యమైనంతవరకు కౌన్సిలింగ్ చేసి కలిపేలా కృషి చేయాలన్నారు.

పరిశ్రమల నిర్వహణపై సర్వే



చిన్నబమ్మిడిలో పరిశ్రమను తనిఖీ చేస్తున్న జిల్లా గణాంకాధికారి మురళీకృష్ణ, ఉప గణాంకాధికారి దేశూల్ల సురేంద్ర తదితరులు

కోటబొమ్మాళి: జిల్లా గణాంకాధికారి కె.మురళీకృష్ణ, ఉప గణాంకాధికారి దేశూల్ల సురేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం కోటబొమ్మాళి మండలంలోని పలు గ్రానైట్ పరిశ్రమలు, రైస్ మిల్లుల్లో పరిశ్రమల నిర్వహణ, ఆర్థిక స్థితిగతులపై గణాంక సర్వే నిర్వహించారు. స్థూల జాతీయోత్పత్తి సర్వేకు జిల్లాలో 62 పరిశ్రమలు ఎంపిక కాగా.. అందులో 15 పరిశ్రమలు టెక్కలి డివిజన్‌లో ఉన్నాయి. ఈ మేరకు కోటబొమ్మాళి మండలంలోని పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి, నిమ్మాడ గ్రామాల్లో ఉన్న పరిశ్రమలను సందర్శించారు. కార్యక్రమంలో టెక్కలి డిప్యూటీ గణాంకాధికారి పీసీ నందా, కోటబొమ్మాళి గణాంకాధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వర్సిటీలో పాముల కలకలం



వర్సిటీ ఆవరణలో పాము సంచారం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిరంతరం పాములు తిరుగుతుండటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అంతర్గత రోడ్లు, క్యాంపస్ ఆవరణలో, వసతి గృహం ఆవరణలో పాములు వర్షాకాలంలో కనిపిస్తున్నాయి. మరో పక్క వర్సిటీ భవనాలు, తరగతి గదుల పక్క పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. వాటిని తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య



రిమ్స్‌లో చిన్నారావు మృతదేహం

గార : మండలంలోని పెద తూలుగు పంచాయతీలో భార్య కోప్పడిందన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. చిన్నారావు అనే వ్యక్తికి భార్య చిన్నమ్మడు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. ఆటో నడుపుతూ జీవనం సాగించే చిన్నారావుకు మద్యం అలవాటు ఉంది. దీనికి తోడు బాగా అప్పులపాలైపోయాడు. ఈ విషయంలో బుధవారం చిన్నారావును భార్య కోప్పడటంతో మనస్తాపానికి గురై గురువారం ఉదయం 6.30 గంటలకు పురుగు మందు తాగేశాడు. కాసేపటికే వాంతులు కావడంతో వాసన గమనించిన భార్య, పిల్లలు ఆయనను రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పారు.

సీట్ల కేటాయింపు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్‌ఎం పురం క్యాంపస్‌లో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) రెండేళ్లు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల కేటాయింపు పూర్తిచేశారు. త్వరలో క్లాస్‌వర్క్ ప్రారంభించనున్నారు. 978 మందికి సీట్లు కేటాయించగా, మార్పులు, చేర్పులు కోరుకున్న విద్యార్థులకు ఈ నెల 26న మరోసారి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఇతర క్యాంపస్‌ల్లో సైతం విద్యార్థులు కోరుకునే బ్రాంచ్‌ల్లో ప్రవేశాలు పొందవచ్చు. శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి సివిల్‌లో 95 మంది, మెకానికల్‌లో 39 మంది, ట్రిపుల్ ఈలో 86 మంది, ఈసీఈలో 344 మంది, సీఎస్ఈలో 353 మంది ప్రవేశాలు పొందారు. ఎక్కువగా విద్యార్థులు సీఎస్ఈ, ఈసీఈలకు ప్రాధాన్యత ఇచ్చారు. త్వరలో ఇంజినీరింగ్ మొదటి సెమిస్టర్ క్లాస్‌వర్క్ ప్రకటించనున్నట్లు క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు.

లంపీ స్కిన్.. టీకాలు వచ్చేన్





చికిత్స అందిస్తున్న పశువైద్యులు

- 250 బృందాలతో 3.82 లక్షల పశువులకు వ్యాక్సిన్లు
- నేటి నుంచి ఆగస్టు 18 వరకు నిర్వహణ

జలుమూరు:

పశువులకు సోకే అతి ప్రాణాంతక వ్యాధుల్లో ప్రధానమైనది ముద్ద చర్మం(లంపి స్కిన్). రైతులు అప్రమత్తతతోనే నివారించుకోవాలని, చిన్నపాటి నిర్లక్ష్యం చేసినా పశువులు మృతి చెందే అవకాశం ఉంటుందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనిలో భాగంగా వ్యాధి నివారణకు జిల్లాలో ఈ నెల 20 నుంచి ఆగస్టు 18 వరకూ సుమారు 250 బృందాలతో 3,82,100 పశువులకు ఉచితంగా వ్యాక్సిన్లు వేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయరాజ్ తెలిపారు. ఇప్పటికే అన్ని డివిజన్, మండల కేంద్రాలలో పశువైద్యులకు, సిబ్బందికి అవగాహన కల్పించామని పేర్కొన్నారు. వ్యాక్సిన్లు కూడా ఆయా డివిజన్ కేంద్రాలకు చేర్చామని చెప్పారు. ముద్ద చర్మ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి సంక్రమిస్తే నివారణ చర్యలను ఆయన వివరించారు.

వ్యాధి సంక్రమణ ఇలా..

పశువులను ఆశించే కీటకాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వేడి, తేమతో కూడిన వాతావరణం ఉన్న నెలల్లో వ్యాధి వ్యాప్తి ఎక్కువ. జోరీగ, రక్తం పీల్చే ఈగలు, దోమలు, కొడుసుల ద్వారా కూడా వ్యాప్తి చెందుతాయి. కొన్నిసార్లు రైతులు వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులతో కలపడం, వాటి దాణా పాత్రలు వీటికి వినియోగించడం ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు..



ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువు

- వ్యాధి సోకిన పశువులు 104 డిగ్రీల నుంచి 105 డిగ్రీల వరకూ జ్వరంతో బాధపడతాయి.
- కళ్ల నుంచి నీరు కారడం, ముక్కు, నోటి ద్వారా సొంగలు వస్తాయి.
- శరీరమంతా కణతులు, బొడిపెలు, రక్తం కారే పుండ్లు ఏర్పడతాయి. పక్కటెముకలు, కాళ్లు, వెన్నుముక, పొదుగు, కను రెప్పలు తదితర భాగాలకు వ్యాప్తి చెందుతాయి. వీటి ప్రభావం 7 నుంచి 12 రోజులు వరకూ ఉంటుంది.

చికిత్స ఇలా..

- బాధిత పశువులను మిగిలిన పశువుల నుంచి వేరు చేయాలి
- పశువైద్యులను సంప్రదించి చికిత్స అందజేయాలి. వ్యాధి తీవ్రత బట్టి మందులు వాడాలి.
- జ్వరం, కాళ్ల వాపు అధికంగా ఉంటే తగిన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు అందించాలి.
- గుంతలతో కూడిన గాయాలు ఏర్పడితే యాంటీ బయాటిక్‌తో కూడిన ఆయిట్‌మెంట్ వాడాలి.
- దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా పశువైద్యుని సూచన మేరకు మందులు వినియోగించాలి.
- హోమియో,ఆయుర్వేద మందులు తిప్పతీగ, నేల వేము తదితర వ్యాధి నిరోధక శక్తి పెంచే మందులు వాడటం శ్రేయస్కరం.

వ్యాధి నివారణ

- బాధిత పశువులను ఇతర ప్రదేశాలకు రవాణ చేయరాదు. సంతలో క్రయ విక్రయాలు చేయకూడదు.
- వ్యాధి ప్రభావిత ప్రాంతం నుంచి పశువులు వలస వెళ్లకుండా చూడాలి.
- కీటకాల నియంత్రణ, దోమతెరల వినియోగం, పశువులు తొట్టెలు(దాణా పాత్రలు) శుభ్రం చేయాలి. వేపాకు ధూపం వేయాలి.

శిబిరాలు వినియోగించుకోవాలి..



ముద్ద చర్మ వ్యాధి అతి ప్రమాదకరమైనది. వ్యాధి సంక్రమించక ముందే వ్యాక్సిన్లు పశువులకు వేయించాలి. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యాక్సిన్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

– వి.జయరాజ్, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు

జూడోలో రారాణి



అధికారులు, సంఘ ప్రతినిధుల సమక్షంలో జూడో సాధనలో కడపల సౌమ్యరాణి

- ఏషియన్ జూనియర్ జూడో సెలక్షన్ ట్రయల్స్‌కు సిక్కోలు క్రీడాకారిణి సౌమ్యరాణి
- ఏషియన్ మీట్‌కు ఎంపిక లాంఛనమే
- న్యూఢిల్లీలో నేటి నుంచి జరగనున్న ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక ఏషియన్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికలు నేటి నుంచి మొదలు కానున్నాయి. న్యూఢిల్లీ వేదికగా జరిగే ఈ ఎంపికల్లో పాల్గొనాలని ఇప్పటికే జిల్లాకు చెందిన స్టార్ జూడో క్రీడాకారిణి కడపల సౌమ్యరాణికి పిలుపువచ్చింది. ఈ సెలక్షన్ ట్రయల్స్ కోసం ఆమె తన కోచ్, డీఎస్‌ఏ జూడో కోచ్ పీఎస్ మణికుమార్‌తో కలిసి వెళ్లింది. కొన్నేళ్లుగా సౌమ్యరాణి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాల పంట పండిస్తోంది. ఈ నేపథ్యంలో ఏషియన్ మీట్‌కు ఎంపిక లాంఛనమేనని సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులంతా భావిస్తున్నారు.

పోటీల్లో దిగితే పతకంతో రావాల్సిందే..

పోటీల్లో దిగితే పతకంతో తిరిగి రావాల్సిందే అన్నట్టుగా సౌమ్యరాణి సత్తాచాటుతూ వస్తోంది. గత ఐదారేళ్లుగా జూడోలో పదుల సంఖ్యలో పతకాలు సాధించి యువ క్రీడాకారులుకు ఆదర్శంగా నిలించింది. ఈ ఏడాది జనవరిలో నెలలో చెన్నైలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఖేలో ఇండియా యూత్ నేషనల్స్ జూడో పోటీల్లో 40 కేజీల విభాగంలో రజత పతకం సాధించి ఔరా అనిపించింది. దానికి ముందు సౌత్ జోన్ నేషనల్స్‌కు బంగారు పతకం సాధించి, సబ్ జూనియర్ నేషనల్స్ గోల్డ్, స్కూల్‌గేమ్స్ నేషనల్స్‌లో మూడు పతకాలు, అనేక నేషనల్స్, స్టేట్‌మీట్స్‌లో పతకాల పంట పండించింది.

మధ్య తరగతి కుటుంబం నుంచి..

కడపల సౌమ్యరాణి ప్రస్తుతం శ్రీకాకుళంలోని గుజరాతీపేటలో నివాసం ఉంటోంది. తండ్రి శంకరరావు ఓ ప్రైవేట్ చిట్స్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తుండగా, తల్లి కృష్ణవేణి ఆశా కార్యకర్త. సౌమ్యరాణి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. జిల్లాకు చెందిన శాప్ జూడో కోచ్ పీఎస్ మణికుమార్ వద్ద శిక్షణ పొందుతూ అంచెలంచెలుగా ఎదుగుతోంది.

ప్రతిభను నమ్ముకున్నాను: సౌమ్యరాణి



న్యూఢిల్లీలో జరగనున్న సెలక్షన్ ట్రయల్స్‌కు మా కోచ్ మణికుమార్‌తో కలిసి వెళ్తున్నానని, ఎంపికల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఏషియన్ మీట్‌కు ఎంపికవుతానని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. సెలక్షన్‌కు వెళ్లేందుకు, నాణ్యమైన డైట్ ఫుడ్‌కోసం డాక్టర్ పీవీఎస్ రామ్మోహన్ సాయం చేసి ఆదుకోవడం సంతోషంగా ఉందని సౌమ్యరాణి, కోచ్ మణికుమార్ తెలిపారు.

రైతుల సమస్యలపై ఎంపీ కలిశెట్టికి వినతి



రైతుల సమస్యలపై ఎంపీకి వినతి అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

రణస్థలం: కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేసేలా చొరవ తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహన్‌రావు, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2020–21 సంవత్సరాల్లో ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకి శుక్రవారం రణస్థలంలో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సీ2 ప్లస్ 50శాతం ప్రకారం మద్దతు ధరల చట్టం చేసి అమలు చేయాలని, రైతులు, వ్యవసాయ కార్మికులకు ఒకసారి రుణ విముక్తి కలిగించాలని కోరారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ ప్రైవేటీకరణ చట్టం రద్దు చేయాలని కోరారు. సమగ్ర బీమా పథకం అన్ని పంటలకు, పశు పోషణ సంబంధిత ప్రభుత్వ రంగం పరిధిలోనే వర్తింపు చేయాలని, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూలమైన ప్రధానమంత్రి పంటల బీమా యోజన పథకం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు అందరికి పింఛన్లు ప్రతి నెలా రూ. 10వేలు ఇవ్వాలని అన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తగిన సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గోప్యంగా ఆశీలు వేలంపాట ఖరారు

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీలో 7వ వార్డు చింతాడ గ్రామంలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంతలో ఆశీలు వసూళ్లకు వేలంపాటను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జి.రవి ఆధ్వర్యంలో అధికారులు గోప్యంగా నిర్వహించారు. కేవలం ఇద్దరు వ్యక్తులు, వారి అనుచరులు మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి వేలంపాటను పూర్తి చేసేశారు. పాటలో చింతాడ గ్రామానికి చెందిన బోర హరనాథ్, గుండ వెంకటరమణ పాల్గొన్నారు. మొదటుగా సర్కారు వారి పాట రూ. 7,07,500 లతో ప్రారంభించగా బోర హరనాథ్ రూ. 7,19,500కు పాటను దక్కించుకున్నారు. 2022–23, 2023 –24 సంవత్సరాల్లో సంత వేలం పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పురపాలక సిబ్బంది చింతాడ సంత ఆశీళ్లను వసూలు చేసేవారు. ఈ ఏడాది కూడా మార్చిలో నిర్వహించిన వేలం పాటలో ఎవరూ పాల్గొనక పోవడంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పురపాలక సచివాలయ సిబ్బందే సంత ఆశీలను వసూలు చేస్తున్నారు. వేలంపాట సందర్భంగా కమిషనర్ జి.రవి మాట్లాడుతూ వేలంపాట సమాచారాన్ని పురపాలక సంఘ ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

ఒత్తిళ్లను తట్టుకుంటూ..

- సంస్కరణల బాటలో ముందుకువెళ్తున్న బీఆర్ఏయూ వీసీ
- అధికార పార్టీ నుంచి ఆగని ఒత్తిళ్లు



వర్సిటీలో వీసీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ యూనియన్ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి విశ్వ విద్యాలయాల అధికారుల మార్పుపై మంకు పట్టు పట్టింది. వర్సిటీ వీసీలు రాజీనామా చేసి తీరాలని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 17 మంది వైస్‌చాన్స్‌లర్లు రాజీనామా చేయగా, వీరి స్థానంలో ఇన్‌చార్జి వీసీలను నియమించారు. దీంతో ప్రస్తుతం ఒత్తిళ్లు పట్టించుకోకుండా ముందుకు సాగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం వీసీ కేఆర్ రజిని చర్చనీయాంశంగా మారారు. ఈ ఏడాది జనవరి 18వ తేదీన వీసీగా ఈమె బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలలు పూర్తవుతోంది. ఈమెకు సైతం విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ కార్యాలయం నుంచి జూన్ 29 డెడ్ లైన్ పేరున ఒక సారి, జూలై రెండో తేదీలోపు డెడ్ లైన్ పెడుతూ మరో సారి రాజీనామా చేయాలని హెచ్చరికలు వచ్చినట్లు సమాచారం. మరో పక్క హెచ్చరికలతో పాటు ఈనెల నాలుగో తేదీన తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్) ప్రత్యక్ష ఆందోళనకు దిగింది. వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా చేయాలంటూ పరిపాలన కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. వీసీ విధులకు సైతం ఆటంకం కలిగించారు. అయినా వీసీ ధైర్యంతో ముందుకు సాగుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యావేత్తగా వీసీ ఇక్కడ పలు సంస్కరణలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. అంతర్గత పాలనపై దృష్టిపెడుతున్నారు. పాలనలో అందరినీ భాగస్వామ్యం చేస్తూ బాధ్యతలు అప్పజెప్పారు. వర్సిటీని సంస్కరణల బాటలో నడిపిస్తున్న ఈమెకు ప్రధానంగా వర్సిటీలో మహిళా ఉద్యోగులు మద్దతుగా నిలిచారు. మరో పక్క దళిత సంఘాలు, మేధావులు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చాయి. వర్సిటీని అన్ని విధాలా ప్రగతి పథంలో నడిపిస్తున్న ఈమెపై ఒత్తిడి సరికాదన్న అభిప్రాయం అన్ని వర్గాల నుంచి వస్తుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం 2018లో ఏర్పడగా, ఎప్పుడూ వీసీలు రాజీనామా చేసిన సంఘటనలు లేవు.

ఆర్మీ జవాన్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



శ్రీకాంత్ మృతదేహంపై జాతీయ జెండా కప్పి నివాళులు అర్పిస్తున్న ఆర్మీ అధికారులు

సోంపేట: బారువ కంభ వద్ద గురువారం రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందిన ఆర్మీ జవాన్ శ్రీకాంత్ సాహుకు అధికార లాంఛనాలతో శుక్రవారం బారువ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. సోంపేట సామాజిక ఆస్పత్రిలో శవ పంచనామా నిర్వహించాక మృతదేహాన్ని బారువ తరలించారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు పార్వతీశం, జున్ను తీవ్రంగా రోదించారు. ఆర్మీ అధికారులు శ్రీకాంత్ మృతదేహంపై జాతీయ జెండాను కప్పి రెండు నిమిషాలు మౌనం పాటించారు. బారువ గ్రామంలోని యువత, గ్రామస్తులు, విశ్రాంత సైనికులు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 53 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: నిరుద్యోగ యువత తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యంతోపాటు అనుభవాన్ని గడించాలని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం సంగీత్ మొబైల్స్, కేఎల్ గ్రూప్ సంస్థల్లో ఖాళీలకు నిర్వహించిన జాబ్‌మేళాలో 53 మంది ఎంపికయ్యారు. తొలుత జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం ఆమె నిరుద్యోగులకు పలు సూచనలు చేసి, అనేక అంశాలపై దిశానిర్దేశం చేశారు. సంగీత్ మొబైల్స్‌కు 32 మంది, కేఎల్ గ్రూప్‌కు 21 మంది ఎంపికైనట్టు చెప్పారు.

తప్పిన పెను ప్రమాదం

- జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- తొమ్మిది మందికి గాయాలు



ఇరుక్కున్న బస్సు డ్రైవర్ శ్రీనివాసరావు



బస్సు నుంచి బయటకు వచ్చిన ప్రయాణికులు



గాయపడిన లారీ క్లీనర్

ఎచ్చెర్ల క్యాంపస్, ఎచ్చెర్ల: ఇంకొన్ని నిమిషాల్లో ఇంటికి చేరిపోతామనుకున్న ప్రయాణికులను రోడ్డు ప్రమాదం నిలువునా కుదిపేసింది. మరణ భయాన్ని కలిగించి కనికరించి వదిలేసింది. 45 మంది ప్రయాణికులు గల ఆర్టీసీ బస్సు నడిరోడ్డుపై లారీని ఢీకొట్టడంతో ప్రయాణికులంతా ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తేరుకునేలోపే తొమ్మిది మంది గాయపడ్డారు. మిగిలిన వారంతా బతికించావురా.. అంటూ దేవుడికి మొక్కుకున్నారు. వివరాల్లోకి వెళితే..

విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు శుక్రవారం జాతీయ రహదారిపై లావేరు మండలం అదపాక సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. బ్రేక్ డౌన్ కారణంగా లారీ అక్కడ నిలిపి ఉంచారు. అదే వాహనాన్ని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగమంతా నుజ్జునుజ్జయిపోయింది. బస్సు డ్రైవర్ సీహెచ్ శ్రీనివాసరావు స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయారు. వెంటనే స్థానిక యువకులు పోలీసులకు సమాచారం అందించి సహాయ చర్యలకు ఉపక్రమించారు. ఎచ్చెర్ల, లావేరు ఎస్ఐలు చిరంజీవి, స్వామినాయుడు ఆధ్వర్యంలోని పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. స్టీరింగ్ వద్ద చిక్కుకున్న డ్రైవర్‌ను శ్రమించి బయటకు తీశారు. ఆయన రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. మరో పక్క ఆగి ఉన్న లారీ టైర్ మరమ్మతులు చేస్తున్న క్లీనర్ గౌతమ్ గాయపడ్డారు. బస్సు ఢీకొట్టినప్పుడు లారీ ముందుకు కదలడంతో లారీ టైరు కింద కాలు ఉండిపోయి గాయాలయ్యాయి. అలాగే బస్సు ముందు సీట్లలో కూర్చున్న ప్రయాణికులు సూర్యప్రకాష్, సూర్యప్రభాకర్, వికాస్, లక్ష్మీనారాయణ, మల్లేసు, రోహిత్, హేమసుందర్‌లు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఐదుగురు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. బస్సు డ్రైవర్, లారీ క్లీనర్‌లకు మాత్రం కాళ్లు విరిగిపోయాయి. బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎవరికీ ప్రాణాపాయ పరిస్థితి లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సహాయ చర్యలు పర్యవేక్షించారు. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ ప్రతినిధులు కూడా సహాయ చర్యల్లో పాల్గొన్నారు. అలాగే బస్సులో ఉన్న ప్రయాణికులను కాంప్లెక్స్‌కు చేర్చే చర్యలు చేపట్టారు. లావేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.